# మగబుద్ధి

## కె.వి యల్. నరసింహశాస్త్రి

మినీ కథ

వెంట పడి తిరుగుతాడు.

ఎప్పుడన్నా యథాలాపంగా వెనక్కి తిరిగితే, ఎటో చూస్తుంటాడు.

ఎక్కడికి పోయినా వదిలి పెట్టడు.

ఏమిటో గురుడి గొడవ?

తెలుసుకుంటే పోలా?

తెలుసుకుందాం!

ఎలా?

నవ్వాలి!

ఓస్, నవ్వేద్దాం.

కొంచెం చొరవ చేశాడు.

"అలా పార్కుకి వస్తారా" అన్నాడు.

"పదండి" అంది తను.

ఏమిటేమిటో చెప్పటం మొదలు పెట్టాడు.

"శంకరాభరణం" ఇరవయ్యారు సార్లు చూశాట్ట.

హీరో కృష్ణంటే ప్రాణంట.

వాళ్ళ అమ్మమ్మ ఆవకాయ బాగా చేస్తుందట.

అలా రోజూ పార్కులో కలుసుకుని ఏదేదో చెప్పేవాడు తనకి. తను వింటుండేది. ఇవి చెప్పుకునేవాళ్ళు దొరక్కనే తన వెంట తిరిగాడా?

చాలా అన్యాయం.

ఈ బోరు భరించటం తనవల్ల కాదు.

"సినిమాకు వెళదాం రండి" అన్నాడు ఓ రోజున.

"అలాగే" అంది తను.

ఇంటర్వెల్ లో డ్రింకు, పాప్‌కారన్....

వక్కపొడికూడా కొనుక్కోనీ లేదు.

ఎగ్జిబిషన్‌కి—

అందులో జెయింట్ వీల్....

ఒకే సీటులో కూర్చుని పైనుంచి కిందకి, కిందనించి పైకి—

ఓ సాయంకాలం—

పార్కులో అందమైన జంటలు బహు అందంగా, బలవంతంగా చల్లని గాలి అనుభవిస్తున్న కాలం...

హృదయాన్ని విప్పుతున్నా నన్నాడు.

విప్పాడు.

"నేనింతవరకు చాలామంది ఆడవాళ్ళని చూశాను. పరిశీలించాను. కాని మీలాంటి స్త్రీని నేనెప్పుడూ చూడలేదు. మీరు స్త్రీజాతిలో మణిరత్నం. మీకు అందమైన మనసుంది. మిమ్మల్ని మనసారా ప్రేమిస్తున్నాను. నా ప్రేమను అంగీకరించి నన్ను కరుణించండి. జన్మజన్మలకి నా ప్రేయసి మీరే, ఈ దాసుడు మీవాడే" అన్నాడు.

నవ్వుతూ చూసింది తను.

"తొందరేం లేదు. మీరూ ఆలోచించుకునే చెప్పండి," అంటూ పోజు పెట్టాడు.

మర్నాడు తను హృదయం విప్పింది.

"నాకు ఇంతవరకు పరిచయమైన మగవారిలో మీలాంటివారి నెప్పుడూ చూడలేదు. మీరు మగజాతిలో మేలిమి బంగారం. మీలాంటి ఉదారహృదయులు అరుదు. మీకు అందమైన హృదయం ఉంది. మీ ప్రేమను మనసారా అంగీకరిస్తున్నాను. ఏడేడు జన్మలకీ నా దైవం మీరే. ఈ పాదదాసికి మీ గుండెలో ఇంత చోటివ్వండి" అంది తను.

ఏదోలా చూశాడు.

వెర్రినవ్వు నవ్వాడు.

"ఇంక పోదామా" అన్నాడు.

మామూలుగా విడిపోయే చోట.

రోజూ చెప్పే పురాణం చెప్పలేదు.

కొత్తమాట అన్నాడు.

"గుడ్ బై"—

ఆ తర్వాత,

వెంటపడి తిరగటం లేదు.

వెనక్కి తిరిగి చూసినా, వాడు పత్తాలేడు.

వాడు చెప్పినదానికి తనేమీ భిన్నంగా చెప్పలేదే? వాడన్నట్లే తనూ అన్నది.

ఏమిటి వాడి బుద్ధి?

ఓ నవ్వు నవ్వుకుని సాగిపోయింది తను. *